క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నేరేడుచర్ల : దిర్శించర్ల 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని నేరేడుచర్ల టౌన్- 1, 2 11 కేవీ ఫీడర్స్ కింద ఎన్నెస్పీ కాలువ పక్కన ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేస్తున్నందున నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఇన్‌చార్జ్ ఏఈ పందిరి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

30న భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టం -2025పై చింతలపాలెంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఈనెల 30న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ టి.సురేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్, అధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని రైతులు, ప్రజా ప్రతినిధులు, న్యాయవాదులు, నాయకులు సదస్సులో పాల్గొనాలని ఆయన కోరారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



రాంరెడ్డిని సన్మానిస్తున్న ఐజేయూ నాయకులు

హుజూర్‌నగర్ : బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన సాముల రాంరెడ్డిని శనివారం హుజూర్‌నగర్‌లో ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఐజేయూ జిల్లా అధ్యక్షుడు కోల నాగేశ్వరరావు యూనియన్ ప్రతినిధి వర్గం నరేందర్‌రెడ్డి, బి.శ్రీనివాసచారి, జానీపాషా, ఆర్పీ గౌడ్, కె.రామనాథం, ఐ.రామకృష్ణ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

నడిగూడెం : ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ దాసరి సంజీవయ్య అన్నారు. శనివారం నడిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అర్హులందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపీఓ విజయలక్ష్మి, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వంద రోజులు పని కల్పించాలని వినతి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కూలీలు

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్లలో కూలీలకు వంద రోజులు ఉపాధి హామీ పనులు కల్పించాలని మాజీ సర్పంచ్ కోలాహలం లక్ష్మీనరసింహరాజు కోరారు. ఈమేరకు శనివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కూలీలతో కలిసి ఆందోళన చేసి అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అరుణ, సుశీల, నాగేంద్ర, సైదులు, బి.సైదులు, గురువయ్య, బుచ్చయ్య, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్ : ప్రపంచ కార్మికుల దినోత్సవం (మేడే) ను జయప్రదం చేయాలని టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు జి.వెంకన్న, బాబు, రామయ్య, వెంకన్న, మనీ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



గారకుంటతండాలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

గరిడేపల్లి : తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రభుత్వ పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ గుగులోతు శాంతి, ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు కోరారు. శనివారం గరిడేపల్లి మండలంలోని గారకుంటతండా గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నరేందర్ నాయక్, సందీప్‌నాయక్, ప్రవీణ్‌కుమార్, రాజు, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

లైట్లు వేశారు.. కనెక్షన్ మరిచారు

- జాన్‌పహాడ్‌రోడ్డులో నిరుపయోగంగా సెంట్రల్ లైటింగ్
- రాంపురం రోడ్డు, మున్సిపల్ కార్యాలయం రోడ్డులో లైట్ల ఏర్పాటులో జాప్యం
- రాత్రివేళ రహదారులు అంధకారం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



జాన్‌పహాడ్ రోడ్డులో నిరుపయోగంగా ఉన్న సెంట్రల్ లైటింగ్

నేరేడుచర్ల : పట్టణంలోని పలు ప్రధాన రహదారుల్లో విద్యుత్ లైట్ల ఏర్పాటులో అధికారులు జాప్యం చేస్తున్నారు. దీంతో రాత్రి వేళలో రోడ్లు చీకటిమయంగా మారుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే పట్టణంలోని జాన్‌పహాడ్ రోడ్డు, రాంపురం రోడ్డు, మున్సిపాలిటీ కార్యాలయం రోడ్డును ఇటీవల రూ. 15 కోట్ల వ్యయంతో విస్తరించారు. రోడ్ల విస్తరణ పనులు మూడేళ్ల క్రితం ప్రారంభించగా నత్తనడక సాగాయి. ఎట్టకేలకు నాలుగు నెలల క్రితం పూర్తయ్యాయి. రోడ్డు పనులు పూర్తయ్యాక మూడు నెలల క్రితం జాన్‌పహాడ్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. కానీ నేటికీ విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో అవి అలంకారప్రాయంగా మారాయి. అయితే రోడ్డు విస్తరణ సమయంలో గతంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చే క్రమంలో వాటికి ఉన్న విద్యుత్ లైట్లు కూడా దెబ్బతిన్నాయి. అసలే జాన్‌పహాడ్ రోడ్డు వ్యాపారపరంగా రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో రాత్రి వేళలో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో ప్రజలు కొనుగోళ్ల కోసం వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ పాలకవర్గం ఈ ఏడాది జనవరిలో ముగిసింది. పాలకవర్గం లేకపోవడంతో సెంట్రల్ లైటింగ్ గురించి పట్టించుకునే వారు లేకుండా పోయారని స్థానికులు అంటున్నారు. ఇక రాంపురం రోడ్డు, మున్సిపాలిటీ కార్యాలయం రోడ్లలో జిగ్‌జాగ్ విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉండగా కాంట్రాక్టర్ నేటి వరకు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జాన్‌పహాడ్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంతో పాటు రాంపురం, మున్సిపల్ రోడ్లల్లో జిగ్‌జాగ్ విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

త్వరలో విద్యుత్ లైట్లు వెలిగిస్తాం



ప్రస్తుతం జాన్‌పహాడ్ రోడ్డులో గల సెంట్రల్ లైటింగ్‌కు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం విద్యుత్ శాఖకు డీడీలు చెల్లించాం. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరై ఏర్పాటు చేయగానే కనెక్షన్ ఇచ్చి సెంట్రల్ లైటింగ్ వెలిగిస్తాం.

– యడవల్లి అశోక్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, నేరేడుచర్ల

భూసమస్యల పరిష్కారానికి 'భూభారతి'

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

పాలకవీడు : రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వతంగా పరిష్కరించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం పాలకవీడు మండలంలోని గుడుగుంట్లపాలెంలో గల రైతు వేదికలో భూభారతి చట్టంపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలోని 18 రాష్ట్రాల్లో భూ హక్కుల అంశాలపై అధ్యయనం చేసి భూభారతి చట్టాన్ని రూపొందించారని తెలిపారు. ఈ చట్టంతో మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లోనే భూ సమస్యలకు చెక్ పెట్టవచ్చన్నారు. భూ సమస్యలపై దరఖాస్తు చేసుకున్న రైతులకు ఏడాది కాలంలోనే పరిష్కారం లభిస్తుందన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతుల వద్దకే అధికారులు వెళ్లి సమస్యను తెలుసుకుంటారని చెప్పారు. నూతన ముసాయిదా రైతులకు వరం లాంటిదని పేర్కొన్నారు. భూముల క్రయ విక్రయాల్లో గత చట్టాలు కుటుంబాల మధ్య చిచ్చురేపాయని అన్నారు. 2016కు ముందు సాదాబైనామా ద్వారా సంక్రమించిన భూములకు మోక్షం కలుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు వివరాలు సేకరించి హక్కులు కల్పిస్తారని తెలిపారు. ఆధార్‌లా ప్రతీ కమతానికి భూధార్ కార్డు జారీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నాలుగు మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి భూభారతి చట్టాన్ని అమలు పరుస్తున్నట్లు తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ మండలాల్లో ఎదురయ్యే సమస్యలు, మార్పులు, చేర్పులపై ఉన్నత స్థాయి కమిటీ తదుపరి నిర్ణయం తీసుకుంటుందన్నారు. రెవెన్యూ శాఖలో అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ రైతులకు అవగాహన కల్పించారు. సదస్సులో ఆర్డీఓ శ్రీనివాసులు, ప్రత్యేక అధికారి శంకర్, ఎంపీడీఓ లక్ష్మి, ఎంఏఓ కల్యాణచక్రవర్తి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ కమలాకర్, మాజీ ఎంపీపీ భూక్యా గోపాల్, మోతీలాల్, జితేందర్‌రెడ్డి, జ్యోతి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన సీపీఐ నిరంతర పోరాటం



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్

చిలుకూరు : పేదల పక్షాన సీపీఐ నిరంతరం పోరాటం చేస్తోందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం చిలుకూరు మండల కేంద్రంలో జరిగిన పార్టీ గ్రామ శాఖ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. గ్రామాల్లో సీపీఐని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం కొత్త చిలుకూరు గ్రామ శాఖ కార్యదర్శిగా సాహెబ్ అలీ, పాత చిలుకూరు గ్రామ శాఖ కార్యదర్శిగా చిలువేరు ఆంజనేయులతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు దొడ్డా నారాయణరావు, పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు కొండా కోటయ్య, దొడ్డా వెంకటయ్య, చేపూరి కొండలు, బాలేబోయిన రాంబాబు, సిరాపురపు శ్రీను, పిల్లుట్ల కనకయ్య, మండవ అచ్చయ్య, కట్టెకోల నాగేశ్వరరావు, సుల్తాన్ వెంకటేశ్వర్లు, కస్తూరి సత్యం, కొండారు శ్రీను, కస్తూరి సైదులు, పూల వాసు, అనంతుల రాము, బాలేబోయిన రవి, కొండలు, శ్రీను, తిరుమలరావు, జానీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడమే లక్ష్యం



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

నేరేడుచర్ల : రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడమే జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి అన్నారు. జై బాబు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం నేరేడుచర్ల మున్సిపాలిటీలోని 1, 2, 8 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేవిధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు సందీప్‌రెడ్డి, బచ్చలకూరి ప్రకాశ్, తాళ్ల సురేష్‌రెడ్డి, మచ్చ శ్రీను, రణపంగ నాగయ్య, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమూర్తి, సైదులు, ఇస్తియాక్, శ్రీను, సైదులు తదితరులు ఉన్నారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి చేయూత



కాంపాటి లింగయ్య కుటుంబసభ్యులకు చెక్కు అందజేస్తున్న ఫొటోగ్రాఫర్లు

మోతె : మండలంలోని ఉర్లుగొండ గ్రామానికి చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ కాంపాటి లింగయ్య గత ఏడాది అనారోగ్యంతో మరణించారు. శనివారం గ్రామంలో నిర్వహించిన లింగయ్య సంస్మరణ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంఘం ఆధ్వర్యంలో లింగయ్య కుటుంబానికి లక్ష అరవై వేల రూపాయల ఆర్థికసాయం అందజేశారు. ఆ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి బీమిడి మాధవరెడ్డి మాట్లాడుతూ.. ఫొటోగ్రాఫర్స్ ఒకరికొకరు అండగా ఉండి సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కూకుట్ల లాలు, జిల్లా మీడియా ఇన్‌చార్జ్ రాగం నాగేష్, మోతె మండల అధ్యక్షుడు వేముల కృష్ణ, కార్యదర్శి మురళీధర్, కోశాధికారి లింగయ్య, ఎండి జానిమియా, మధు, రాజు, బ్రహ్మం, నర్సింహారావు, కమ్మల రమేష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం ఏర్పాటు అభినందనీయం



కోదాడరూరల్ : అన్నదానం చేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు



కోదాడరూరల్ : అన్నదానం చేస్తున్న స్వర్ణభారతి ట్రస్ట్ సభ్యులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని రంగా థియేటర్ ఆవరణలో స్వర్ణభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో అర్వపల్లి భద్రమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు శనివారం 319వ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ గౌరవ సలహాదారులు పైడిమర్రి సల్లిబాబు మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకు అన్నదానం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో చారుగండ్ల రాజశేఖర్, పందిరి సత్యనారాయణ, రాయపూడి వెంకటనారాయణ, యాదా సుధాకర్, వెంకటనారాయణ, నరేందర్, సాయి, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల : మండలంలోని ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో శనివారం కోదాడ వాసవి క్లబ్ ఉపాధ్యక్షుడు బండారు సాంబశివరావు -పద్మ దంపతుల మనుమరాలు చార్వి పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశారు. కాంగ్రెస్ నాయకుడు పందిరి నాగిరెడ్డి, వాసవి క్లబ్ అధ్యక్షుడు సేకు శ్రీనివాసరావు, కార్యదర్శి పత్తి నరేందర్, వెంపటి ప్రసాద్, బండారు శ్రీనివాసరావు, గుడుగుంట్ల సాయి, ఆశ్రమ వ్యవస్థాపకురాలు నాగిరెడ్డి విజయమ్మ, జయకృష్ణ, అశ్విని, సాయికృష్ణ, లక్ష్మీనారాయణ, ముక్తేశ్వరి, రంగారావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

గరిడేపల్లి : మండల కేంద్రంలోని నవ చైతన్య ఉన్నత పాఠశాలలో 2005- 06 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల శనివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఆనాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం నాటి ఉపాధ్యాయులు కోనుగంటి వీరారెడ్డి, దేవులపల్లి వెంకటచారిని సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చెవుల వీరబాబు, బొలిశెట్టి వీరబాబు, పొలిశెట్టి వినయ్, మహమ్మద్ రహీంపాషా, రవీందర్, ప్రవీణ్‌రెడ్డి, నరేష్, రాజశేఖర్‌రెడ్డి, విజయ్, సతీష్, వీరశేఖర్, నాగరాజు, పుల్లయ్య, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదం దేశానికి ప్రమాదకరం



హుజూర్‌నగర్ (చింతలపాలెం) : ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు



హుజూర్‌నగర్ : నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : ఉగ్రవాదం దేశానికే ప్రమాదకరమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఉస్తెల సృజన అన్నారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం వద్ద ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మ శాంతించాలని శుక్రవారం చింతలపాలెంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతీయులపై ఉగ్రవాదులు కాల్పులు జరపడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఉగ్రవాదాన్ని తుది ముట్టించేందుకు ప్రపంచ దేశాలు ఏకం కావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్తెల నారాయణరెడ్డి, మండల కార్యదర్శి చింతిరాల రవి, నాయకులు అంకరాజు, గోనె చిన్న అంకయ్య, జియాలుద్దీన్, భీమిశెట్టి సత్యం, కొండ, మంగయ్య, వెంకటరెడ్డి, రామారావు, శ్రీనివాసరావు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నివాళి

హుజూర్‌నగర్ : జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో హతమైన పర్యాటకులకు శనివారం యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ పట్టణంలోని శాంతి స్థూపం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శామ్యూల్, శ్రీను, జాన్ పాల్, సైదా, ప్రసాద్, రాజు, రూబేన్‌సన్, రంజిత్, దయాకర్, ఏస్రోసు, రవీందర్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

చిలుకూరు : జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై దాడికి నిరసనగా శనివారం చిలుకూరు మండల కేంద్రంలో అఖిల పక్షం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరారు. అదేవిధంగా చిలుకూరులో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి మృతులకు నివాళులర్పించారు.



చిలుకూరులో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న అఖిలపక్షం నాయకులు



చిలుకూరు : రెడ్డి సంఘం ఆధ్వర్యంలో..

మున్నూరుకాపు అన్నదాన సత్రం అభివృద్ధికి సహకరించాలి

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో గల శ్రీకృష్ణదేవరాయ మున్నూరుకాపు అన్నదాన సత్రం అభివృద్ధికి తెలుగు రాష్ట్రాల కుల బంధువులు సహకరించాలని సత్రం కమిటీ అధ్యక్షుడు తోట వెంకయ్య నాయుడు, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి కోలా నాగేశ్వరరావు కోరారు. శనివారం మట్టపల్లిలోని సత్రంలో జరిగిన కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. మట్టపల్లిలో మే 10వ తేదీ నుంచి 12 వరకు స్వామివారి కళ్యాణోత్సవాలకు వచ్చే మున్నూరుకాపు కులస్తులకు మూడు రోజులు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు, సత్రం కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, ఆదినారాయణ, అప్పారావు, కాశయ్య, సత్యవతి, తిరుపతిరావు, నాగసైదులు, విజయమాదవి, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దు

అనంతగిరి : రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దని అనంతగిరి తహసీల్దార్ హిమబిందు అన్నారు. శనివారం అనంతగిరి మండలంలోని వాయిలసింగారం గ్రామంలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే అమ్ముకొని మద్దతు ధరతో పాటు బోనస్ పొందాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ మోతుకూరి రాజారావు, రైతులు కొల్లు సుబ్బారావు, వీరబోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పది గంజాయి మొక్కలు స్వాధీనం



మాట్లాడుతున్న సీఐ రజితారెడ్డి

మేళ్లచెరువు : మండలకేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ రజితారెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీకి చెందిన కల్లెం సుభాని అనే వ్యక్తి తన ఇంటి వెనుక భాగాన కూరగాయలతోపాటు గంజాయి మొక్కలు సాగు చేస్తున్నాడు. సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్‌ఐ దివ్య, స్థానిక ఎస్‌ఐ పరమేష్‌లు తమ సిబ్బందితో కలిసి వెళ్లి దాడులు నిర్వహించి పది గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి మొత్తం 450 గ్రాముల బరువు ఉన్నట్లు తెలిపారు. ఒక్కో మొక్క విలువ రూ.10వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మట్టపల్లిలో నారసింహుడి నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని శనివారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. హోమం నిర్వహించారు. అనంతరం ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం పూర్తిచేశారు. నిత్యకల్యాణంలో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్క పూజ, మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక జరిపారు. అదేవిధంగా స్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రవేశం తరువాత మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు తీవ్రగాయాలు

చిలుకూరు: మండల పరిధిలోని జానకీనగర్ స్టేజీ వద్ద కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు ధాన్యం లారీ బోల్తా పడి డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. శనివారం కోదాడ నుంచి హుజూర్‌నగర్ వైపు ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. దీంతో డ్రైవర్‌ను సమీపంలో ఉన్న లారీ ఓనర్స్ అసోసియేషన్ వారు చూసి వెంటనే బయటకు లాగారు. తీవ్ర గాయాలపాలైన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బాబోయ్.. కరిచేస్తున్నాయ్ !



జాన్‌పహాడ్‌లో వీధుల వెంట సంచరిస్తున్న కుక్కలు

- గ్రామాల్లో బెంబేలెత్తిస్తున్న కుక్కలు, కోతులు
- ప్రజలపై శునకాల దాడి
- మార్చి నెలలో 104 కుక్క కాటు కేసులు నమోదు
- నివారణ చర్యలు చేపట్టాలని ప్రజల వేడుకోలు

పాలకవీడు : మండలంలో కుక్కలు, కోతుల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారురు. ప్రతిరోజూ ఏదో ఒక చోట ప్రజలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. దీంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటే ప్రజలు జంకుతున్నారు. కుక్కలు దాడులు చేస్తుండడంతో గాయాలపాలై ఆస్పత్రులకు పరుగులు తీస్తూ వైద్యం చేయించుకుంటున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు రోడ్లపైకి రాలేని పరిస్థితి నెలకొంది. ఒక్క మార్చి నెలలోనే పీహెచ్‌సీ పరిధిలో 104 కేసులు నమోదయ్యాయి. అయితే కుక్కల సంతాన నియంత్రణ చర్యలు లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. పాలకవీడు మండలంలో 22 గ్రామాల్లో దాదాపు 15 వేల కుక్కలు ఉన్నాయి. అధికారులు, పాలకులు స్పందించి వీధి కుక్కలు, కోతుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వ్యాక్సిన్ అందుబాటులో ఉంది

కుక్కలు, కోతులు కరిచిన గంటలోపు చికిత్స అందించాలి. కావున కుక్క కాటుకు గురైన, కోతులు కరిచిన వెంటనే పీహెచ్‌సీకి రావాలి. నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం. ఆరోగ్యం కేంద్రంలో వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. నేరేడుచర్ల పీహెచ్‌సీ పరిధిలో మార్చి నెలలో 104 కుక్క కాటు కేసులు నమోదయ్యాయి.

– పి.నాగిణి, వైద్యాధికారిణి, పాలకవీడు

కుక్కల బెడదను నివారించాలి

ఇంట్లో సామన్ల కోసం దుకాణం వద్దకు వెళ్లాలంటేనే భయమేస్తోంది. వీధుల వెంట ఉండే కుక్కలు మీదకు ఎగబడుతున్నాయి. చేతిలో కర్ర, పక్కన తోడు ఉంటే తప్ప బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కుక్కలు పెద్దవాళ్లు, పిల్లలపై దాడులు చేస్తున్నాయి. అధికారులు కుక్కల బెడదను నివారించాలి.

– ఉయ్యాల లింగమ్మ, గుడుగుంట్లపాలెం గ్రామం